# మర్రినీడ

కరివేపాకును చూచి కళ్ళెర్రజేసే వాళ్ళుంటారా?

పాపం, కరివేపాకు రెమ్మలు ఎవరికైనా వుపయోగపడుతాయేగాని, ఎవరికీ ఎట్టి అపకారం చేయవు కదా! సైలెంట్‌గా ఎంతో సర్వీసు చేస్తాయి. మీ వంటకాలకు సువాసనలిస్తాయి, మీ నోటికి రుచిని కలిగిస్తాయి!

మరి ఎవరైనా 'ఆఫ్టరాల్ కరివేపాకు'ను చూచి కళ్ళెర్ర జేస్తారా!

చేశారు మరి!

మళ్ళీ అలాంటి వాళ్ళు, ఇలాంటి వాళ్ళు కాదు. రెపరెపలాడే వయస్సులో వున్న ఒకానొక కన్నెపిల్ల కారులో పోతూ, ఫుట్‌పాత్‌మీద గుట్టగా పోసిన కరివేపాకు కట్టల్ని చూచి కళ్ళెర్ర జేసింది.

అసలే ఎర్రటి అందమైన ముఖం - కోపంతో మరీ ఎర్రనయింది. అసలే చిదిమి పెట్టిన దీపం - వత్తి ఎక్కువై భగ్గుమంది.

కారులో తన ప్రక్కన కూర్చొన్న పెద్ద కళ్ళద్దాల యువకుడ్ని చూచి, "ఆ కరివేపాకును చూశావా బావా?" అంది క్రింది పెదవిని మునిపంటితో కోపంగా కొరుకుతూ.

"వాట్ బేబీ! కరివేపాకు కొందామంటావా? కారు ఆపించనా?" అన్నాడు అతను.

ఆ అమ్మాయి పేరు బేబీ!

బేబీ ఇంకా కోపంగా, "షటప్!" అంది.

పాపం అతను వెర్రి వెంగళాయి ముఖం వేసుకొని వుండిపోయాడు.

అతని పేరు సత్యం. బేబీ మేనత్త కొడుకు.

కారు ఆగగానే బేబీ విసురుగా దిగి, దూకుడుగా మేడమీద వున్న తన గదిలోకి వెళ్ళిపోయింది. ఆ గదిని ఆ యింట్లో వాళ్ళంతా 'ఫారన్' గది అంటారు. అందులో అన్నీ ఫారన్ వస్తువులే ఉంటాయి. ఫారన్ గూడ్స్ కొనటం బేబీ హాబీ. వంటికి రుద్దుకునే సబ్బు దగ్గర్నుంచి లోపల వేసుకునే బ్రా వరకు ఆమె అన్నీ ఫారన్ వస్తువులే వాడుతుంది - ఎంత ఖరీదైనా సరే!

బేబీ చేసిన షాపింగ్ పాకిట్స్ దొంతర్లు పట్టుకునొ ఆమె వెనకాల నడిచేడు సత్యం. తానాయింటి నౌకరో, మేనల్లుడో అతనికే అర్థం కాదు పాపం! తన స్థానమేదయినా అతను పట్టించుకోడు. తనకు ఆ యింట్లో వేళకింత తిండి దొరుకుతుంది- అంతే చాలు! అదీ లేక తన వూళ్ళో పస్తులతో అలమటించి పోయాడు.

సత్యాన్ని చూడగానే బేబీ చిందులు త్రొక్కసాగింది. మీదపడి కరుస్తోన్నట్లు, "ఆ కరవేపాకు సంగతి ఏం చేశావు?" అంది కోపంగా.

కరివేపాకును ఏం చేయమంటుందో పాపం అతనికి అర్థం కాలేదు. అడిగేడు.

కోపంగా, "యు హేవ్ నో బ్రెయిన్స్" అంది. "మనమీద పోటీగా వాడెవడో మన కూరగాయల దుకాణం ప్రక్కన కరివేపాకు అమ్మటం, అందరూ వాడి దగ్గర కొనుక్కోవటం - ఇట్స్ ఏ గ్రేట్ ఇన్సల్ట్! అది చూచిన దగ్గర్నుంచి ఓ మైగాడ్, నాకెలా వుందో తెల్సా?-"

ఎలా వుంటుంది - ఒక మహా వృక్షం కూకటివ్రేళ్ళతో కూలిపోతున్నట్లూ, ఒక మహా భవనం పునాదులతో కదిలిపోతున్నట్లూ, తమ యింట వెలిసిన లక్ష్మీదేవి భూమిలోకి క్రుంగిపోతున్నట్లూ వుంటుంది!

ఆమెలోని రక్తం అలాంటిది మరి!

ఆమె సుదర్శనం గారి చిన్నకూతురు.

సుదర్శనం గారు ఆ పట్టణంలో - ఆ పరగణాలో పెద్ద బిజినెస్ మేగ్నేట్, బిగ్‌షాట్!

ఆయనకు మిల్లులూ, ఫేక్టరీలూ, సిన్మాహాలులూ, మందుల షాపులూ, బ్రాందీ షాపులూ, మేడలూ, మిద్దెలూ, పౌల్ట్రీలూ, ఫౌండ్రీలు, తోటలూ, దొడ్లూ - ఆఖరికి కూరగాయల దుకాణం కూడా వుంది. ఇవన్నీ ఆయనొక్కరే చూచుకోగలరా! చేతికందివచ్చిన కొడుకులున్నారు. వాళ్ళు కొన్ని చూచూకుంటారు. ఇల్లరికపుటల్లుళ్ళు వున్నారు. వాళ్ళు కొన్ని చూచుకుంటారు. యింట్లో కోడళ్ళూ, కూతుళ్ళూ వున్నారు. వాళ్ళు కొన్ని చూచుకుంటారు. బయట ముండలూ, రండలూ వున్నారు. వాళ్ళూ కొన్ని చూచుకుంటారు.

పట్టణపు శివారుల్లో సుదర్శనం గారికి పెద్ద ఫారమ్ వుంది. అది వంద ఎకరాలుంటుందో - రెండువందల ఎకరాలుంటుందో! అందులో కోళ్ళ పౌల్ట్రీ వుంది. ద్రాక్ష చెట్లున్నాయి. పాడి పశువులున్నాయి. కూరగాయల మడులున్నాయి. ఆ ఫారమ్ మేనేజ్‌మెంట్ అంతా ఈ చిన్నకూతురు బేబీ చూచుకుంటూంది. ఖాళీగా వున్న ఫారమ్‌లో వీటన్నింటిని హాబీగా ఈ బేబీయే నడుపుతూంది. హోల్‌సేల్‌గా అమ్మినంత అమ్మించి, సరదాగా, టోకుగా కోడిగ్రుడ్లూ, కోడి మాంసం, పాల సీసాలూ, సీజన్‌లో ద్రాక్షపళ్ళూ, కూరగాయలూ అమ్మిస్తూంది. ఇవన్నీ అమ్మటానికి ఆమెకు రెండు షాపులున్నాయి, గుమస్తాలూ వున్నారు.

వాటిల్లోదే ఈ కూరగాయల దుకాణం.

బేబి ఇంకా రోషంగానే వుంది. ఇంకా కోపంగానే వుంది.

"బావా! వెంటనే ఫోను చేసి ఆ గుమస్తా పంతుల్ని రమ్మను" అంది.

పంతులు వచ్చాడు.

అతణ్ని చూడగానే రేచుకుక్కలాగా లేచింది. "వాడెవడో నామీద పోటీగా నా దుకాణం ప్రక్క కరివేపాకు అమ్ముతుంటే మీరంతా ఏం చేస్తున్నారు? వెంటనే వాణ్ని అక్కడ్నుంచి లేపించండి" అంది.

"పాపం! ఆ కుంటి మదార్ సాహెబ్ తమరు అక్కడ కూరగాయల దుకాణం తెరవకముందు నుంచీ ఆ అరుగుమీదే కూర్చొని కరివేపాకమ్ముకుంటున్నాడు-" అని ఏదో చెప్పబోయాడు.

అతను చెప్పేది వినిపించుకోలేదు. కోపంతో రెచ్చిపోయింది. "ఆ షాపింగ్ కాంప్లెక్స్ అంతా మాదే, ఆ అరుగూ మాదే! మా అరుగు మీద వాడు కూర్చోవడానికి వీల్లేదు. వెంటనే వాడ్ని తరిమేయండి" అని ఆర్డర్లేసింది.

ఇంత చిన్నపిల్లకు ఈ కోపం, ఈ పట్టుదలా ఎలా వచ్చాయో అనుకున్నాడు తల పండిన గుమస్తా పంతులు.

మర్నాడు స్విమ్మింగ్ నేర్చుకుంటానికి స్విమ్మింగ్‌పూల్‌కు కార్లో వెళ్ళుతూ అరుగువైపు చూచింది. మదార్ సాహెబ్ లేడు.

గర్వంతో కళ్ళు మెరిశాయి.

కాని వుత్తరక్షణంలో ఆ గర్వం కాస్తా బుడగలాడా ఠప్పున ప్రేలిపోయింది.

అరుగుమీద కూర్చునే మదార్ సాహెబ్ క్రింద ఫుట్‌పాత్ మీద బైఠాయించి కరివేపాకు కట్టలమ్ముతున్నాడు.

బేబీ కుతకుత లాడిపోయింది.

ఇంటికెళ్ళగానే సత్యాన్ని పిలిపించి చెడామడా తిట్టింది.

"ఏం చెయ్యమంటావు బేబీ! ఫుట్‌పాత్ మనది కాదుగదా?" అన్నాడు మెల్లగా.

బేబీ ఆలోచనలో పడింది.

ఈ కుంటిరాస్కెల్, ఈ డర్టీ డెవిల్ తన కొక పెద్ద ప్రోబ్లమ్ అయిపోయాడే అనుకుంది.

ఆ రాత్రి డైనింగ్ టేబిల్ దగ్గర తండ్రికి తన ప్రోబ్లమ్ చెప్పింది.

ఈ వయస్సుకే ఈ అఫెన్సివ్ స్పిరిట్, ఈ స్ట్రగుల్, పుట్టుకొక్కులను నేల రాయాలనే తపనా అబ్బినందుకు లోలోన ఎంతో మెచ్చుకున్నారు.

చల్లగా నవ్వి "దీనికింత గుంజాటన పడాలా బేబీ?" అన్నాడు.

బేబీ తన నిస్సహాయతకు సిగ్గుతో తలవంచుకుంది.

"నీ ప్రోబ్లమ్‌కు సొల్యూషన్ వెరీ సింపుల్ మైడియర్ బేబీ! వాడంతట వాడు అక్కడ్నుంచి లేచిపోయేటట్లు చేస్తే చాలు."

అదే తనకు కావల్సింది. "ఎలా డాడీ? ఎలా?" ఆత్రంగా అడిగింది.

"సింపుల్ - వెరీ సింపుల్. వాడు కట్టకి ఎంతకి అమ్ముతున్నాడు?"

"పది పైసలు."

"దెన్, నీవు అయిదు పైసలకే మరో రెండు రెబ్బలు ఎక్కువ వేసి అమ్ము - దట్సాల్."

బేబీ ఎగిరి గంతేసింది.

"డాడీ! రియల్లీ యు ఆర్ గ్రేట్! నాకీ ఐడియానే తట్టలేదు. వెరిగుడ్ డాడీ! ఇక చూస్కో నా

తడఖా చూపిస్తా" అంటూ వాళ్ళ డాడీ వళ్ళో కూర్చుని ఆయన బుగ్గటలు పుణికి, మీసాలు లాగి, చక్కలిగింతలు పెట్టి తను కిలకిలా నవ్వి ఆయన్ని బలబలా నవ్వించింది.

మర్నాటి నుంచి ఎక్కువ రెబ్బలు వేసి పదిపైసలకు అమ్మే కరివేపాకు కట్టను అయిరు పైసలకే అమ్మించటం మొదటు పెట్టింది.

మదార్‌సాహెబ్ విలవిల్లాడి పోయాడు. జనం అతని దగ్గర కొనటం లేదు. అందరూ బేబమ్మ దుకాణంలోనే కొంటున్నారు. కోసుకొచ్చిన ఆకు ఖర్చు కావడం లేదు. ఎండిపోతూంది. తన అయిదు పైసలకమ్మితే - గొర్రెపొట్టేలు పెద్ద కొండను ఢీకొన్నట్లే! అయిదు పైసలకమ్మితే వచ్చే డబ్బులు చెట్టు అమ్మిన వెంకాయమ్మ గారికి కట్టటానికీ, యింట్లో నూకల గింజలకూ చాలవు.

ఈ విషయాలన్నీ ఏ రోజుకారోజు సత్యం చేత చెప్పించుకుని కిలకిలా నవ్వేస్తూంది.

"ఆ ముసలాడ్ని చూస్తోంటే జాలివేస్తోంది బేబీ" అంటాడు సత్యం.

ఫారన్ రికార్డు ప్లేయిర్‌లోంచి వచ్చే వెస్టర్న్ మ్యూజిక్‌కు అనుగుణంగా ట్విస్ట్ చేస్తూ ఎగతాళిగా "అయ్యో పాపం" అంటుంది.

"ఇక్కడే కూర్చోవడం దేనికి? యిళ్ళవెంట 'కరివే-పాక్-' అని అరుచుకుంటూ పొమ్మను!" అంటుంది.

"వాడు కుంటోడు బేబీ! చెక్క కాలేసుకుని యిళ్ళవెంట ఎలా తిరుగుతాడు?" జాలిగా అంటాడు.

"వండర్‌ఫుల్!" అంటూ కుంటికాలు మీద జోక్స్ వేస్తుంది.

"చిన్నపిల్లలు ఆకలితో అలమటించిపోతున్నారని నాకు చెప్పుకుని ఏడ్చాడు" అన్నాడు ఒక రోజున

"ఆకలా? ఆకలి అంటే ఎలా వుంటుంది బావ?"

సత్యం విరక్తిగా నవ్వాడు. "ఆకలి అంటే ఎలా వుంటుందో కూడా నీకు తెలియదు బేబీ! నాకు తెల్సు - అదెంత దుర్భరమో?"

"ఎందుకు బేబీ, ఆ ముసలాడి మీద ఇంత కక్ష కట్టావు?" అంటాడు నిస్సహాయంగా.

"ఈ గేమ్‌లో వున్న థ్రిల్ నీకు తెలియదు బావా!" అంటుంది.

కుంటి మదార్ సాహెబ్ నెత్తిన గుడ్డేసుకుని అక్కడ్నుంచి పూర్తిగా లేచిపోయాడనివిన్న రోజున బేబీ సంతోషం పట్టలేక చప్పట్లు కొట్టి సత్యాన్ని కౌగిలించుకున్నంత పనిచేసింది.

"నీ కక్ష తీరిందా తల్లీ? ఇప్పుడు నీకళ్ళు చల్లబడ్డాయా? ఆఫ్టరాల్ వాడి నెలసరి సంపాదనా, వాడి పెళ్ళాం బిడ్డల బ్రతుకూ, నీవు రాసుకునే ఫారన్ సెంట్ ఖరీదు చేయదు-" అని బయటికి అన్లేక లోపలే అనుకున్నాడు సత్యం కోపంగా.

ఒకరోజు, "ఆ కుంటి రాస్కెల్ ఏఁవంటున్నాడు బేబీ?" అని సుదర్శనంగారు అడిగేరు.

"మట్టిగొట్టుకు పోయాడు డాడీ! మంత్రం నీది, పారదా?" అంది గర్వంగా.

తృప్తిగా నవ్వుకుని, "మరి కరివేపాకు ఇంకా అయిదు పైసలకే అమ్మేస్తున్నావా బేబీ?" అని అడిగేరు.

"నో డాడీ, పదిహేను పైసలు చేసేశా!"

"వాట్! పదిహేను పైసలా? గుడ్!"

"ముందేసిన రెండు రెమ్మలు కాక మరో రెండు రెమ్మలు కూడా తగ్గించేశా!"

"ఈజిట్! వెరీ గుడ్ బేబీ, వెరీగుడ్!"

సత్యం అక్కసు పట్టలేక, "నీకంటే బేబీ 'రెండు రెమ్మలు' ఎక్కువ చదివింది అంకుల్!" అన్నాడు.

- 'విజయ' మాసపత్రిక

అక్టోబరు 1978

★